# సీతమ్మగారి సీమ ప్రయాణం

'సీతమ్మ దంపతులు సీమ వెళ్లుతున్నారు, ఎంత అదృష్టం!'

'నిజమే! పెట్టి పుట్టిన జన్మలు! అందరికి దక్కుతుందా? ఈ వైభోగం?'

'అవును! ఏరుదాటి అవతలికి వెళ్లలేం, సముద్రాలు దాటి పాతాళలోకం లాంటి అమెరికా దేశం అంటే మాటలా?' దేనికైనా పెట్టి పుట్టాలి'!

'శారదమ్మా! ఇప్పుడు వోడలూ, షిప్పులూ ఎక్కి సముద్రాలు దాటవలసిన పనిలేదట, సరాసరి విమానం ఎక్కికూర్చుంటే, తెల్లవారే వరకు నమ్మశక్యం కాని కలలా ఆ అమెరికాలో వాలిపోతాం' అంటూ మా ఆడబిడ్డ తాయారు చెప్పింది. 'అవునండీ వదినెగారు! పిల్లలు కల వాళ్లకి పున్నామ నరకం వుండదు. వాళ్ల మూలాన్ని వైతరణీ నదిని సులభంగా దాటుతాం, కానీ యీ సముద్రాలు దాటి పగటి దీపాలు వెలిగే ఆ దేశాన్ని చూట్టం, అందరికీ సాధ్యమా? మనమూ కన్నాం ఒక్కొక్కరం వో అరడజను 'పిల్లల్ని' ఏం లాభం?

'వెంకటరత్నం! మనం కన్నాం నిజమే! కన్నవాళ్లను చదివించి ఎంత వరకు యోగ్యులను చేశాం ? అంటూ ఆలోచించవద్దా? అంటూ చుట్టపక్కాలు తర్కవితర్కాలు చేసుకుని చివరకు 'దేనికైనా పూర్వజన్మ సుకృతం' అంటూ తీర్పు చేసుకున్నారు, సీతమ్మను సాగనంపటానికంటూ వో వారం ముందే యిల్లు పట్టకుండా వచ్చి చేరారు.

ఇల్లంతా పెళ్లి వాతావరణం నిండుకుంది. అందరూ గల గలమంటూ తలో మాట అడ్డుతున్నారు. అందరికీ సమాధానంగా సీతమ్మ వరసలు కల్పుతూ ..

'ఇంత దూర ప్రయాణమంటే మాటలా? ఎన్ని సర్దుకోవాలి? సమయానికి రెండోకోడలు ఇంట్లో లేదు, ఆవిడ పుట్టింటి నించి వచ్చే వరకు నేనిలా కాళ్లు చాపుకు కూచుంటే అవతల పనులేం కావాలి?

ఆఁ ఇంతకు అసలు విషయం మరిచాను, సిద్ధాంతి గారిని వో మాటిలా రమ్మని కబురు పెట్టాలి, దూర ప్రయాణం, క్షేమంగా వెళ్లి లాభంగా వచ్చేట్టు వుండాలి కదా? ఇక మా వాడి నాన్న, అదే మా వారు వున్నారు చూడండి! వారికి విషయం అసలు పట్టినట్లే లేదు; ఇంత అదృష్టం నడుస్తూ మన కడప ముందు వాలితే వారికి వో రాగి పైసా దొరికినట్లు లేదంటే నమ్మండి. ఏం మనిషో బాబు! అయ్యో! ఇప్పుడేనా? మా పెద్దవాడు పుట్టినప్పుడు కూడా యింతే!'' నవ్వితే నవరత్నాలు వొలికినట్లూ, మాట్లాడితే మంచి ముత్యాలు రాలినట్లూ మూాభావంగా వుంటారు.

అక్కడికి వెళ్లేవాళ్లంతా అవేవో గిఫ్టులంటూ తీసుకెళ్తారట, అవైనా బజారు వెళ్లితెస్తారో? లేదో? కనుక్కోవాలి' అంటుండగానే.

ఇంతలోకే మరో చెలికత్తె 'సీతా! పచ్చళ్ల సంగతేం చేశావ్' అంటూ ప్రశ్నించింది. 'అన్నీ సిద్ధంగానే వుంచాను'. ఆ దేశంల జనం పచ్చడికి మొకం వాచి వుంటారంటూ విని కాస్త ఎక్కువ రకాలే పెట్టాను. అవన్నీ సర్దుకోవాలి. అవే అయిదు జాడీలయ్యాయి.

'అవును మరి! సీతమ్మ పచ్చళ్లంటే మాటలా? ఈ పచ్చళ్ల రుచి గనక అక్కడి మనవాళ్లు చూచారంటే? నోటి తుప్పుడుల్లంగా ఆ పచ్చడి రుచి చూచిన ప్రతి వారి నోటా సీతమ్మ మాటే రావాలి' అన్నారు మరో యిద్దరు.

'అట్లని కాదులెండి! అక్కడ మొగుళ్లతో కాపరాలు చేసే మన పిల్లలంతా యిలాంటి పనుల్లో అనుభవంలేని కసరు గాయలే! అంతా పసికుంకల్లాంటి వారేనాయె. వాళ్లకు ఈ పచ్చళ్ల మోతాదులూ, వైనాలు తెలిస్తేగా? యీ రుచులు వచ్చేందుకు? పైగా యీ కాలపు పిల్లలకి ఆడా మగా అంటూ భేదం లేకండా మూడేళ్లనుండి పుస్తకం పట్టుక్షని ముప్పై ఏళ్ల వరకూ, డిగ్రీలంటూ, డాక్టరీ అంటూ, పట్టాలపై పట్టాలు పోటీ పడ్తూ పుచ్చుకోవటంతో సరిపోతూ వుంటే? పచ్చళ్లు, అప్పడాలంటూ నేర్చుకోవటానికి సమయం ఏదీ? అంటూ వుంటే.

మరో పెద్దావిడ అందుకుని 'సీతా! ఎన్నైనా చెప్పు; నీ చేతి మహత్తు వుంది చూచావూ? అది అందరికీ రాదు. ఆ వొడుపూ, నేర్పూ, నీ ప్రత్యేకతలు. అయినా! నీది ఈనాటి అనుభవం గనకనా?' అంటూ వుంటే సీతమ్మ ఏదో మరిచినట్లు జ్ఞాపకం చేసుకుంటూ,

'మరిచాను, పచ్చళ్లకు తోడు కొన్నిరకాల కారప్పొళ్లూ అవి పట్టుకెళ్లాలి సున్ని వుండలూ, అరిసెలు, కారప్పూసా అది మా వియ్యంకురాలు అప్పటికప్పుడు చేసి తాజాగా పంపుతానంది. ఇక వాటి చింత నాకు అట్టే లేదు' అంటూ లేచి వంటింట్లోకి నడిచింది.

ఒకొక్కరే సీతమ్మను కలిసి వత్తామంటూ బయలు దేరారు. వచ్చినవాళ్లు వుత్త చేతుల్తో రాలేదు సుమా! వాళ్లూ, అక్కడున్న తమ వారికంటూ పచ్చళ్లూ, గాజులూ, బ్లౌజులూ, మిఠాయిలు డబ్బాల్లో నింపుకుని అడ్రసూ టెలిఫోను నంబర్లతో సహా వచ్చి సీతమ్మ గారిని అభినందిస్తూ కారప్పూస తని కాఫీతాగి, సీతమ్మగారు ఆ చలిదేశంలో పాటించాల్సిన భద్రతల గూర్చి వుచిత సలహాలిచ్చి మరీ వెళ్లుతున్నారు.

సీతమ్మలో తొలిసారిగా గర్వరేఖ తొంగి చూచింది, తాను చాల ఇంపార్టెంట్ వ్యక్తినంటూ ఫీలై పోతూ వుంది. ఈ సామాన్లన్నీ ముందటి వసారా చాలక పడక గది దాకా వ్యాపించాయి. తానంటే అందరికీ ఎంత ఆప్యాయత! ఎంత అదీ, ఇదీ, అంటూ సంబరపడిపోయింది.

ఈ విధంగా సీతమ్మ వో రెండు వ్యాన్లకు సరిపోయే సామాన్లని విదేశీ ప్రయాణానికంటూ తన వెంట తీసుకెళ్లడానికి సిద్ధపరిచింది. చివరకు ఇంటి నుంచి బయలు దేరే ముహూర్తం సమీపించింది.

ఈ సామానంతా చూచి పాపం ఆనందరావుగారు నిజంగానే హడలి పోయారు. ఇందులో పదోవంతుకూడా పట్టుకెళ్లడానికి వీల్లేదన్నాడు.

సీతమ్మ మూతి తిప్పుతూ, ముక్కు చీత్తూ, 'మీరలా అంటే పది మందిలో నా పరువేం కాను? భద్రంగా తీసుకెళ్లుతానంటూ మాటిచ్చాను; ఇంత బ్రతుకూ బ్రతికి, చివరకు సీతమ్మ 'మాట తప్పింది' అనే సడికి నన్ను అర్హురాలిని చేస్తున్నారు. అయినా? నాకు తెలియక అడుగుతాను మన వాడకట్టంత విమానం కదా? యీ మాత్రం బరువు మోయలేదా? ఏం? అంతగా డబ్బుకు ఆశపడితే? వో వందరూపాయలు చేతిలో పెడితే పోలా? అంటూ మొదలుపెట్టింది.

సీతమ్మ చెల్లెళ్లిద్దరూ 'నిజమే బావగారెప్పుడూ యింతే!' అంటూ తాళం వేశారు.

విషయం అంతా గ్రహించిన సీతమ్మ తమ్ముడు కలుగ జేసుకుంటూ 'అక్కా! నీవు వూర్కో! ఈ సామానంతా నీ వెంబడే వస్తుంది, కానీ నీ పక్కనే వుండదు, సామాన్లు పెట్టే చోట వుంటుంది. మీరు వెళ్లండి ఆ తరువాత నేను పంపిస్తాగా' అంటూ సమాధాన పరిచాడు, ఆనందరావు బావమరది చలాకీ తనాన్ని లోలోపలే మెచ్చుకున్నాడు.

సీతమ్మ ఆనందరావులు కలతలు చల్లారగా కలిసి నవ్వీ మురుస్తూ బయలుదేరి వెళ్లారు. అమెరికాకు పోయే విమానం తెల్లవారు ఝామున బొంబాయి నుండి మూడున్నర గంటలకు బయలు దేరుతుంది.

రాత్రి పదకొండు గంటల నుండీ దంపతులిద్దరూ ఏరోడ్రోం లాంజిలో గడపవలసి వచ్చింది. అక్కడ కూర్చున్నంత సేపూ, సీతమ్మకు మళ్లా తన సామానూ, యిరుగు పొరుగు వారు తనను నమ్మి పంపుతున్న వారి వస్తువుల భద్రత గూర్చి కలవరం ప్రారంభమైంది. అన్నిటికన్న మిన్నగా తన పచ్చళ్లను గూర్చి మాటి మాటికీ తల్చుకుంటూ అసహనంగా కదుల్తూనే వుంది. కానీ, వాటిని భర్తతో మళ్లా ప్రస్తావిస్తే బాగుండదంటూ --

'ఇదేమిటండీ? ఈ నిశిరాత్రి ప్రయాణం? ఈ విమానం నడిపేవారు ఎవరో? కానీ మన లారీడ్రైవర్లకన్నా రాక్షస ఘటాలై వుంటారు, లేకపోతే నిద్రలు పోగొట్టుకుని ఆకాశంలో గద్దల్లా ఈ ప్రయాణం? పైగా పక్షులు కూడా రాత్రిళ్లు తిరగవ్, అవి తిరిగినా? తిరక్కున్నా ఎవడిక్కావాలి? ఇక్కడ మనమో? ఇంత డబ్బుపోసి నిద్రచెడగొట్టుకుని ఏమిటీ ప్రయాణం' అంటూ సణిగింది.

అది విన్న భర్త 'సీతా! దయచేసి కాస్త వోపికపట్టు! మరీ పిచ్చిగా మాట్లాడకు' కొత్తవిషయాలు చూడు' అన్నాడు.

ఏమైతేనేం అపురూపమైన ఆ ఘడియలు రానే వచ్చాయి. చెకింగ్ అదీ పూర్తి చేసుకుని దంపతులిద్దరూ ప్లేన్ ఎక్కి కూర్చున్నారు. వీరి నంబరు 42, 43, అదృష్టం కలిసి వచ్చినట్లు సీతమ్మగారికి కిటికీ పక్కనే సీటు దొరికింది. అందమైన హోస్టెస్ వచ్చి తనకు బెల్టు కట్టింది. మరో సుందరాంగి వచ్చి చాక్లెట్ తీసుకోమంది. ప్లేను కొంత దూరం భూమ్మీద కదిలినట్టే కదిలి ఝూం అంటూ లేస్తూ తరతరాలుగా స్పీడు అందుకుని స్థిమితంగా వి[illegible] కదలిక లేకండా ప్రయాణిస్తూంది.

ఇంతలోకే లింటా[illegible]కి వేడివేడిగా డబ్బాల్లో ఏదో ఇస్తూ కాఫీ ఇస్తున్నారు. సీతమ్మగారికి అమేయమైన ఆనందం కల్గుతూ వుంది. అయినా ఆమెకు వో విషయం వింతగా వుంది. విమానం కదిలినట్లు లేదు. మరి ఆకాశంలో ఎలా నిల్చుంది. కానీ, అడిగితే? ఆ మాత్రం తెలసుకోలేవా? ఆకాశంలో నాల్గువైపులా ఏదో ఆకర్షక శక్తి వుంటుంది. దాంతో విమానాన్ని ఆపి వుంచుతారు, మనవారు పూర్వం జల స్తంభనం, వాయుస్తంబనం లాంటి విద్యల వల్ల నీళ్లలో, నిప్పుల్లో నడవలేదా? అం[illegible] కోపగించుకుంటారు, అని అనుకుంటూ ఉన్న సమయంలో వో మహత్తరమైన ఐడియా తన మనస్సులో మిలామిలా మెరిసింది.

అదేమిటంటే? ఎలాగూ విమానం ఆగింది గదా! ఈ కాఫీ గ్లాస్ తా[illegible] మారు సామాను గదలోకి వెళ్లి తన పచ్చళ్ల ఐదు జాడీల్లో నూనే అదీ, వొలికి పోకండా [illegible]త్తగా వున్నాయో? లేదో? చూచుకోవాలి. అనే విషయం.. ఆ తాపత్రయంతోనే పక్కనున్న భర్తను తడ్తూ తన అభిప్రాయాన్ని తెలిపింది. ఈ మాట విని ఆనందరావుగారికి నవ్వూ, కోపం రెండూ వచ్చాయి. కానీ, భార్య అమాయకతకు నవ్వుకుంటూ, లాలింపుగా -

'వోసీ పిచ్చిదానా! సామానుల గదికి తాళం వేసి వుంచుతారు. ఆ తాళపు చెవి పెద్ద పైలెట్ చేతిలో వుంటుంది. దాన్ని ఆయన ఎవ్వరికీ ఇవ్వరు. మన అందరి సామాన్లూ జాగత్తగా వుంటాయ్!' అంటూ బుకాయించి సమాధాన పరిచాడు.

సీతమ్మ సంతృప్తిగా సంతోషంగా, టీనేజర్ లా భర్త భుజంపై వాలిపోయింది. ఇలా లండన్ దాకా వెళ్లారు.

లండన్ రాగానే మనం అంటే ప్రయాణీకులు సరాసరి కిందకు దిగివెళ్లరు ఏదో పెద్ద బస్సు డబ్బాలాంటిది వస్తుంది, ఒక పెట్టెలోంచి మరో పెట్టెలోకి సామాను చేరవేసినట్లు ఈ జనం అంతా ఆ డబ్బాలోకి వెళ్లి అక్కడినుంచి ఎస్కలేటరు ద్వారా కిందకు దిగుతారు.

ఎస్కలేటరుకు మెట్లు కూడా వుంటాయి. కానీ నీవు మెట్లు ఎక్కి దిగవలసిన పనిలేదు, ఏదైనా వో మెట్టు మీద నిల్చుంటే చాలు అదే తిరుగుతూ నిన్ను తిప్పుతూ కిందకు చేరుస్తుంది. దిగేప్పుడు జాగ్రత్తగా వుండాలి. లేకపోతే పడిపోయే ప్రమాదం వుంది; అది తెలిసిన

ఆనందరావు తొందరగా కిందకు దిగి భార్యకోసం చూస్తున్నాడు; ఆమె అనుకున్నట్లుగానే పడబోయింది, కానీ, ఆనందరావుగారు పసిపిల్లను ఎత్తుకున్నంత పనిగా రెండు చేతుల్తో సీతమ్మను అలుముకున్నాడు. నిజానికి సీతమ్మగారు ఏంతో సిగ్గుపడిపోయారు, తేరుకుని భర్తతో 'అదేటండీ! మరీ చిన్నపిల్లాడిలా? అందరూ చూస్తుండగానే అలా నన్ను నడుమ్మ అంతా చుట్టి ఎదలకు హత్తుకోటమేనా? ఏదైనా విపరీతమే! అతివృష్టి- అనావృష్టీను' అంటూ కిలకిలలాడింది.

ఈ విధంగా అడుగడుగునా వింతలనూ, విచిత్రాలను అనుభవిస్తూ, అనురాగాలనూ, ఆప్యాయతలనూ పంచుకుంటూ ప్రయాణం సాగించారు. సీతమ్మగారికి ఐస్క్రీం అంటే చాలా యిష్టం. ఎప్పుడో ఇరవై ఏళ్లక్రితం తిన్నది. యిప్పుడు తినాలనే కోరిక పుట్టింది. ఆనందరావుగారు అడిగిందే తడవుగా కొని ఇచ్చాడు. 'మీరూ తినండి! అంటూ ప్రాధేయపడ్డది; అంత చలిలోనూ యిద్దరూ చెరో బార్ కొనుక్కొని తిన్నారు.

సీతమ్మ కొప్పులోంచి ముంగురులు జారి ముఖంపై వాలుతూ వుంటే వో చేత్తో సవరించుకుంటూ పెద్దగా నవ్వుతూ, చాకోబారు, చప్పరిస్తూ ఆనందించింది.

ఇంతలోకే అనౌన్స్మెంటు వచ్చింది. 'ప్లేను అమెరికా బయలుదేరేందుకు సిద్ధంగా వుంది, ఎవరి సీట్లలో వాళ్లు కూర్చోవాలి' అంటూ, ఆ అనౌన్స్మెంటు విన్నవాళ్లంతా గబగబా తమ పనులు ముగించుకుని ప్లేన్ వైపు నడిచి లోపలికి వెళ్లారు.

ఈ మారు సీతమ్మ భర్త సహాయం లేకండా తానే పర్సు భుజాన తగిలించుకుని నడుస్తూ చిరునవ్వుతో అందరినీ కలియ చూచింది. భార్యాభర్తలు యిద్దరూ ఎవరి సీట్లల్లో వారు కూర్చున్నారు.

లండన్ నుండి ఇప్పుడు విమానం అమెరికా వైపు వెళ్లుతూ వుంది.

సీతమ్మ కిటికీలోంచి తొంగి చూస్తూనే వుంది. ఆనందరావు ఆప్యాయంగా సీతమ్మ భుజంపై చేయివేశాడు, ఆ యీ వింతలు చూపుతూ చెబుతున్నాడు. నిజంగా సీతమ్మ గాలిలో తేలిపోతూ వుంది.

అయ్యో! పాపం! తన భర్త ఎంత మంచివాడు; తానే అనవసరంగా హడావిడిపడ్తూ నోరు చేసుకుంది, ఈ మారు తాను తెచ్చిన సామానంతా కిక్కురు మనకండా తానే సర్దుతా నన్నుకుంది. మళ్లా వోమారు భర్తవైపుకు మరికాస్త జరిగి కిటికీలోంచి చూస్తూంది.

భూమ్యాకాశాలకు భేదమే తెలియడం లేదు. నేలా నింగీ ఒకే నీలవర్ణం, ఇప్పుడు విమానం మేఘాలపైనించి ప్రయాణం చేస్తూవుంది. విమానం ఒక్కోసారి కొంత కిందకు దిగినప్పుడు గాలితెప్పల వలె మేఘాలు విమానం కింద తేలుతూ కనిపిస్తున్నాయి. అది సముద్రమా? ఆకాశమా? తెలిసికోవటం సీతమ్మకు కష్టంగా వుంది. చివరకు ధైర్యం చేసి -

'ఏమిటండీ? ఇక్కడ భూమి ఏదీ? ఆకాశం ఏదీ?' అంటూ అడిగింది.

'మనం యిప్పుడు దాదాపు ఆరు గంటలు సముద్రం పైనే ప్రయాణం చేయాలి. ఇప్పుడు మన విమానం మేఘాలకన్నా ఎత్తుగా ఎంతో వేగంగా ప్రయాణం చేస్తూ వుంది. ఆకారణంగానే, నీకు అంతా మహార్ణవంలా గోచరిస్తూంది. భగవంతుడు కళ్లు యిచ్చినందుకు ఈ దృశ్యం చూచి ఆనందించు' అన్నాడు. స్విట్జర్లాండు మంచు పర్వతాలు చూపిస్తూ వాటి ఆనందాన్ని వర్ణించి చెప్పాడు.

అయితే తాము విమానంలో సముద్రంపై ప్రయాణం చేస్తున్నామంటూ భర్త చెప్పగానే 'అయ్యో! ఏదైనా దెబ్బ తగిలి జాడీ పగిల్తే పచ్చడి కాస్త నీళ్లపాలౌతుందేమో? అంటూ వో లిప్తకాలం ఆలోచన, అటు మళ్లినా వెంటనే మరో సందేహం వచ్చింది.

'ఏఁవండీ! మనం ఏ దారీ తెన్నూ లేని అఖండమైన సముద్రంపై ప్రయాణం చేస్తున్నాం కదా? కాలం కలిసిరాక, విమానానికి ఏదైనా జరిగితే? ఎలా దిగడం? ఎక్కడ అడుగు మోపడం? అంటూ ప్రశ్నించింది భర్తను.

ఆ ప్రశ్న విని ఆనందరావు కోపగించుకోలేదు, ఆదరంగా భార్య నడుం చుట్టూ చేయి చుడ్తూ పిచ్చిదానా! విమానానికి ఏ ప్రమాదమూ జరక్కూడదు. ఒక వేళ జరిగిందీ అంటే భూమికీ సముద్రానికి భేదం అంటూ వుండదు. ఇంతపై నుండి కూలినప్పుడు మధ్యలోనే ప్రాణాలు హరీ మంటూ పంచభూతాల్లో కలిసిపోతాయి. శరీరావశేషాలు తునాతునకలై, నుగ్గెనూచై ఎక్కడ పడ్తాయో? అందుకోసం అయ్యో! సముద్రమే ? అంటూ ప్రత్యేకంగా భయపడకు, ఈ సందేహాలూ, భయాలూ బాదరబందీ అంతా విడిచి హాయిగా పాట వింటూ పడుకో! అన్నాడు.

భర్త స్పర్శ, అనురాగం తనను గిలిగింతలు పెడ్తూ వుంటే సీతమ్మ అన్నీ మరిచి స్వర్గసుఖాన్ని అనుభవిస్తున్న అనుభూతిని పొందుతూ ప్రయాణం సాగించింది. విమానం దిగారు, కూతురూ, అల్లుడూ కలిసి వచ్చినట్లున్నారు. అల్లుడు కనపడగానే సీతమ్మగారు కొంగునిండుగా సవరించుకున్నారు.

వీసాలు, పాసుపోర్టులూ అన్నీ చూపించి చెకింగ్ అంతా పూర్తయ్యాక ఈ దంపతులు లాంజి వైపు నడిచారు. అప్పుడు మళ్లా సీతమ్మకు తన సామాను జ్ఞాపకం వచ్చింది.

ఆత్రంగా భర్తను చూస్తూ కమాండింగ్ టోన్‌లో 'అదేమిటండీ! మనం వుత్త చేతులు వూపుకుంటూ నడిచి వెళ్లుతున్నాం? నురి మన సామాన్ల సంగతేం చేశారు? అన్నది.

'అందుకోసమే నోయి వెళ్లుతూంట' సామాన్లన్నీ అదిగో అక్కడ ఖాళీగా వున్న చోట వో గుండ్రటి స్థలంలో రైలు పట్టాల్లా అమర్చారే? అక్కడికి ట్రాలీల్లో వచ్చి చేరుతుంది. తరువాత ఎవరి సామాను వారు గుర్తు పట్టి తీసుకోవాలి అంతే!' అన్నాడు.

అది విన్న సీతమ్మ 'అంతా అబ్బురంగానే వుందండి! దారిలోనే ఇన్ని వింతలు చూస్తున్నామే? మరి ఆ మహానగరంలో ఇంకెన్ని వింతలూ, విడ్డూరాలు కనిపిస్తాయో? తెల్లవాడి బుద్ధివైభవం మెచ్చుకోక తప్పదండి' అంటూ ప్రశంసలు గుమ్మరించింది.

ఆ మాట విన్న ఆనందరావు 'అప్పుడే మెప్పుల దండకం ప్రారంభించకు, ఈ ఆనందం చివరిదాకా వుండనివ్వు' అన్నాడు.

'ఆఁ మీరు మరీను! ప్రతి దానికీ వో అపవాద సూత్రం చెప్పాల్సిందే! మంచిని మంచి అంటాను, చెడును చెడు అంటాను, అంతే కాని, ప్రతి దానికీ ఒకే సూత్రం బిగిస్తూ రోకటి పాట పాడటం నా వల్ల కాదు' అంటూ తర్కంలోకి దిగింది.

చిలిపిగా నవ్వుతూ ఆనందరావు 'అదేమిటే? సీతా! మోస్ట్ అప్ టు డేట్ రేషనలిస్టుగా మాట్లాడుతున్నావ్? ఈ గాలిలోనే ఆ గుణం వుంది కాబోలు, నీవేనా? యిలా మాట్లాడుతున్నది! అంటూ ఆశ్చర్యపోతున్నానోయ్' అంటూ వుండగానే సామాను వచ్చింది. అందరు బిలబిలమంటూ ఆ రైలు పట్టాల చుట్టూ గుండ్రంగా చేరారు.

ఆ యంత్రం అమెరికా వారి సామాను మోస్తూ గుండ్రంగా గిరగిరా చెక్కర్లు కొడుతూ వుంది. ఎవరి సామాను వారు తీసుకుంటున్నారు. సీతమ్మ దంపతుల తాలూకు సూటుకేసు వచ్చింది. నిండుగా పిక్కటిల్ల నింపిన రెండు హాండు బ్యాగులొచ్చాయి. మరో అట్టాడబ్బలాంటిదీ వచ్చింది. అవి కనపడ్డప్పుడల్లా సీతమ్మ సంతోషంతో అరిచినంత పని చేస్తూ భర్తను 'తీసుకోండి! పట్టుకోండి' అంటూ వుంది.

సామాన్ల చక్రం తిరగడం కూడా ఆగింది. ఏవో రెండు మూడు సూట్ కేసులూ ఎవ్వరూ తీసుకోకపోతే అక్కడ పడేసి వున్నాయి. కానీ తన జాడీల జాడ మాత్రం సీతమ్మకు కనిపించలేదు.

సీతమ్మకు కంగారు ఎక్కువైంది. ఇక తట్టుకోలేకపోయింది. అయ్యో తన ఐదు రకాల పచ్చళ్ల జాడీలు ఎమయ్యాయో? ఈ ముదనష్టపు ప్లేను ఏడ విడిచిందో? అంటూ పక్కలో వున్న భర్తను అయ్యో! మన పచ్చడి జాడీలు రాలేదండి! అంటూ గట్టిగా వూపి వూపి తట్టింది.

మాంచి నిద్రలోంచి లేస్తూ కళ్లు తెరిచి 'ఏం ? సీతా కల గన్నావా?' అంటూ అడిగాడు.

పరిసరాలు కలియ జూసుకుని సీతమ్మ 'అయ్యో! ఇదంతా కలేనా? కలైనా ఎంత సుఖం అనుభవించాను' అనుకుంది.